క్లుప్తంగా

సంపూర్ణ అక్షరాస్యతే నూతన విద్యా విధాన లక్ష్యం



మాట్లాడుతున్న డాక్టర్ సహాయరాజ్

మల్కాపురం: సంపూర్ణ అక్షరాస్యతను సాధించడం, విద్యలో నాణ్యత, సమానత్వం, జవాబుదారీతనాలను పెంచడం, విద్యను అందరికీ అతి తక్కువ ఖర్చుతో అందుబాటులోకి తేవడం నూతన విద్యా విధాన లక్ష్యమని ఆంధ్రా లయోలా కాలేజీ కరస్పాండెంట్ డాక్టర్ ఎం.సహాయరాజ్ అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో ఆదివారం నూతన విద్యా విధానంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విద్యా విధాన ఆవశ్యకత, ఉద్దేశాలను తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమకుమారి, ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రొగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పందుల స్వైర విహారం



గుంపుగా ఉన్న పందులు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హిమాచల్ నగర్‌లోని ఆర్ ఆర్ ఎక్స్‌క్లూజివ్ అపార్ట్‌మెంట్ పక్కన ఖాళీ ప్రదేశంలో పందులు తిష్ట వేశాయి. వీధి కాలువల్లో సంచరించి ఖాళీ ప్రదేశాన్ని ఆవాసంగా మార్చుకున్నాయి. చుట్టుపక్కల నివాసాల్లోకి చొరబడుతూ, ఆ మార్గాన వచ్చే వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఈ సమస్యపై వినతిపత్రాలు అందజేసినా ఇంత వరకూ స్పందన లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

భక్తిభావానికి ప్రతీక త్యాగరాజ కృతులు



త్యాగరాజ కీర్తనలు ఆలపిస్తున్న నారాయణ బృందం

ఉక్కునగరం: భారతీయ శాస్త్రీయ సంగీతానికి తలమానికంగా నిలిచే త్యాగరాజ కృతులు.. నిజమైన భక్తి భావనకు ప్రతీకగా నిలుస్తాయని ఉక్కు జనరల్ ఆస్పత్రి సీజీఎం డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్, మార్కెటింగ్ సీజీఎం ఎం.సత్యనారాయణ అన్నారు. స్టీల్‌క్లబ్, విస్కా సంయుక్త ఆధ్వర్యంలో ఉక్కునగరం స్టీల్‌క్లబ్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సద్గురు త్యాగరాజ ఆరాధనోత్సవం-2023 కార్యక్రమంలో వారు మాట్లాడారు. విస్కా అధ్యక్షుడు నేమాని శ్రీనివాస శర్మ, కార్యదర్శి ఎ. కేశవరావు మాట్లాడుతూ సంప్రదాయ బద్ధమైన చక్కని కార్యక్రమాలను ప్రేక్షకులకు అందించడంలో విస్కా ఎప్పుడూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ సంగీత విద్వాంసుడు, ఆకాశవాణి ఏ గ్రేడ్ కళాకారుడు బి.ఎ. నారాయణ బృందంచే నిర్వహించిన పంచరత్న సేవ, త్యాగరాజ విరచిత కృతుల నాద నీరాజనం కార్యక్రమాలు శ్రోతలను భక్తిరస సముద్రంలో ఓలలాడించాయి. కార్యక్రమంలో విస్కా, స్టీల్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

శాకాహార సద్భావన ర్యాలీ

గాజువాక: పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూవ్‌మెంట్ సభ్యులు చినగంట్యాడ పరిసర ప్రాంతాల్లో ఆదివారం శాకాహార సద్భావన ర్యాలీ నిర్వహించారు. సొసైటీ ప్రతినిధి ఎం.శివ గణేశ్వరరావు ఈ ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బ్రహ్మర్షి పత్రీజీ ఆశయం మేరకు శాకాహార జగత్ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ర్యాలీలో శాకాహార ప్రాధాన్యతను వివరిస్తూ నినాదాలు చేశారు. కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ప్రతినిధులు టి.రేవతి, సి.జగదీశ్వరి, పీఎస్ఎన్ మూర్తి, జి.పద్మావతి, బి.అప్పారావు, భాగ్య, రామకృష్ణ, శివాజీ, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

చెత్తకుప్పలు .. మురుగు కూపాలు!



మల్కాపురం మార్కెట్‌లో కాలువ దుస్థితి



ప్రకాష్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై పేరుకుపోయిన వ్యర్థాలు

- దుర్వాసనతో ప్రజల అవస్థలు
- అధికమవుతున్న పందుల స్వైర విహారం

సింధియా: పారిశ్రామిక ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ లోపించింది. పలు ప్రాంతాల్లో చెత్త కుప్పలు.. మురుగు కూపాలు దర్శనమిస్తున్నాయి. భూగర్భ డ్రైనేజీలు లేవు. ఉన్నవి కూడా సరైన నిర్వహణకు నోచుకోకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు. కాలువలు శిథిలమై మురుగంతా రోడ్లపై పారుతూ అపరిశుభ్రత నెలకొంటుంది. ముఖ్యంగా జీవీఎంసీ 40, 62, 63వ వార్డుల పరిధిలోని పలు ప్రాంతాలతో పాటు మల్కాపురం మార్కెట్‌లో పారిశుధ్య నిర్వహణ గాడి తప్పడంతో వీధులన్నీ చెత్తాచెదారంతో నిండిపోయాయి. అపరిశుభ్ర వాతావరణం కారణంగా పందుల సంచారం అధికమవ్వడంతో వీధులన్నీ జుగుప్సాకరంగా మారుతున్నాయి.

పర్యవేక్షణ కరువు

లక్షల రూపాయలతో నిర్మించిన డ్రైనేజీలు సైతం పర్యవేక్షణ లేక పూడికలతో నిండిపోయాయి. భవన నిర్మాణ వ్యర్థాలను సైతం రాత్రి సమయాల్లో రోడ్డుకు ఇరువైపులా డంపింగ్ చేయడంతో డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. చెత్తలోనే ఆహార పదార్థాలతో కూడిన ప్లాస్టిక్ సంచులు ఉండడంతో మూగ జీవాలు వాటిని తిని మృత్యువాత పడుతున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త సమస్య రోజురోజుకు పెరగడంతో ఆందోళనకు ప్రజలు సిద్ధమవుతున్నారు.

ముందుకు సాగని భూగర్భ కాలువల ప్రతిపాదన

పారిశ్రామిక ప్రాంతంలో మురుగు సమస్య దూరం చేసేందుకు భూగర్భ కాలువల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం గతంలోనే నిర్ణయించింది. అధికారులు ప్రతిపాదనలు సైతం సిద్ధం చేసినా భూగర్భ కాలువల అంశంలో మాత్రం పురోగతి లేకుండా పోయింది. దశాబ్దాల కిందట నిర్మించిన కాలువలే ఉండడంతో పరిస్థితి దయనీయంగా మారింది.



40వ వార్డులో చెత్తాచెదారంతో నిండిన డ్రైనేజీ

నిర్వహణ లేక.. కొత్తవి నిర్మించక...

పారిశ్రామిక ప్రాంతంలో పట్టణ ప్రణాళిక పనుల్లో భాగంగా మురుగుకాలువలు నిర్మించాల్సిన అధికారులు ఆ ఊసే ఎత్తడంలేదు. గతంలో నిర్మించినవి సైతం శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రస్తుత అవసరాలకు సరిపోవడంలేదు. అధికారుల పర్యవేక్షణ లోపం ప్రజలకు శాపంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



40వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధిలోని షిప్ యార్డ్‌కాలనీ, సింధియాన్యూకాలనీ, ఏకేసీకాలనీ ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ బలపర్చిన రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ ట్రేడ్ యూనియన్ ప్రధానకార్యదర్శి చంటిబాబు, సచివాలయ కన్వీనర్లు దండి శ్యామ్, మీసాల సత్యనారాయణ, గృహసారథులు చీపురుపల్లి కిషోర్, గుమ్మాల రాజు, బాబ్జి, ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

సుందరీకరణ పనుల పరిశీలన



మర్రిపాలెం వుడా లేఅవుట్ వద్ద వాకర్స్‌తో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడాలేఅవుట్‌లో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆదివారం పర్యటించారు. ఇక్కడి కొత్త పార్క్, పోలీస్ క్వార్టర్స్ ప్రాంతంలో పారిశుధ్య, గ్రీన్ బెల్ట్‌లో ఆధునికీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ కోట్ల రూపాయిలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. మర్రిపాలెం వుడాలేఅవుట్ కొత్తపార్కులో జిమ్ పరికరాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. వాకింగ్ ట్రాక్ లో అత్యాధునిక విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశామని, బుద్ధుని విగ్రహం వద్ద మహిళలకు ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ వార్డును మోడల్ వార్డుగా తీర్చి దిద్దుతానని తెలిపారు. ఆయనతో పాటు డీఈ ఏడు కొండలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మూర్తి, స్థానికులు పాల్గొన్నారు.

120 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బెహరా హాస్పిటల్స్ వారి సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ బెహరా విజయరవితేజ, డాక్టర్ నరేంద్రల పర్యవేక్షణలో 120 మంది స్థానికులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లను సత్కరించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు సెక్రటరీ జనరల్ రాళ్లపల్లి సత్యనాథం, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కార్యదర్శి లంకా వెంకట సుధాకర్, పూర్వ అధ్యక్షులు నిమ్మగడ్డ బుచ్చయ్య, ఉపాధ్యక్షులు ఆదిభట్ల రామకృష్ణ, మళ్ల రామకృష్ణ, ఎ.గంగయ్యచారి, కోశాధికారి ఒ.కూర్మారావు, జాలీ వాకర్ ఎస్.ప్రకాశరావు, కార్యవర్గ సభ్యులు, బి.సూర్యనారాయణ, ఎం.నారాయణ రావు, టి.వి.రమణ, పి.కుమార్‌రాజా వైద్య శిబిరం నిర్వహణకు సహకరించారు.

సర్వీస్ రోడ్డులో గోతుల పూడ్చివేత

ట్రాఫిక్ ఎస్ఐ సహకారంతో చర్యలు



మల్కాపురం సర్వీస్ రోడ్డులో కాంక్రీట్ మిక్సింగ్ వాహనంతో గోతులు పూడ్చుతున్న కార్మికులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం ఎస్‌బీఐ బ్రాంచ్ ఎదురుగా గల సర్వీస్ రోడ్డులో ట్రాఫిక్ పోలీసుల సహకారంతో మరమ్మతులు చేపట్టారు. ఈ మార్గంలో విద్యుత్ శాఖ అధికారులు కేబుల్ వైర్లు ఏర్పాటు చేయడం కోసం తవ్విన గోతులను సరిగ్గా పూడ్చకుండా వదిలేశారు. దీంతో ఈ రహదారిలో ప్రయాణిస్తున్న వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలువురు ప్రమాదాలకు గురయ్యారు. ఈ సమస్యపై మల్కాపురం ట్రాఫిక్ ఎస్ఐ సుదర్శన్‌రావు స్పందించారు. కాంక్రీట్ మిక్సింగ్ వాహన సాయంతో ఆదివారం ఉదయం ఈ సర్వీస్ రోడ్డులో ఏర్పడిన గోతులను పూడ్చే పనులు చేయించారు. దీంతో వాహన చోదకులు హర్షం వ్యక్తం చేశారు. శ్రీహరిపురం నుంచి మల్కాపురం వైపు వచ్చే సర్వీస్ రోడ్డులో తవ్వి వదిలేసిన గోతులను పూడ్చాల్సి ఉంది.

ఘనంగా నర్సింగబిల్లమ్మ నెల పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న ఆలయ కమిటీ సభ్యులు

గోపాలపట్నం: వెంకటాపురం సమీప సనతా కాలనీలో నర్సింగబిల్లమ్మ అమ్మవారి నెల పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కేవీ బాలసుబ్రహ్మణ్యం ఆలయ కమిటీ సభ్యులు విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని పసుపు కుంకుమలతో అభిషేకా లు చేశారు. సాయంత్రం పరస నిర్వహించారు. దీంతో ఈ ప్రాంతంలో సందడి నెలకొంది.

నేటి నుంచి పైడిమాంబ నవరాత్రి మహోత్సవాలు



పైడిమాంబ అమ్మవారు

ఆరిలోవ: జాతీయ రహదారిని ఆనుకుని డెయిరీ ఫారం వద్ద పైడిమాంబ అమ్మవారి నవరాత్రి జాతర మహోత్సవాలు ఈ నెల 27 నుంచి మార్చి 7 వరకు జరగనున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం చాటింపు కార్యక్రమం నిర్వహించారు. 27న అమ్మవారికి పంచామృతాభిషేకాలతో పూజలు చేస్తామని కమిటీ అధ్యక్షుడు మీసాల రామలక్ష్మణ్ తెలిపారు. మార్చి 2న ఆలయ తృతీయ వార్షికోత్సవం నిర్వహించనున్నామన్నారు. మార్చి 7న అమ్మవారి జాతర జరుగుతుందన్నారు. ముగింపు ఉత్సవాల్లో తప్పెట గుళ్లు, బాణసంచా, గరిడి, పులివేషాలు, తీన్‌మార్, ఒడిశా దూమ్ దడక్, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ ఆవరణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

వినూత్నం.. విభిన్నం

- విద్యార్థులకు మేలు చేసేలా 'సెల్ఫ్'
- తీర్చిదిద్దిన నంగినారపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు



సెల్ఫ్ ఆన్‌లైన్ ప్రొగ్రాం తయారు చేసిన టీచర్లను అభినందిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి(ఫైల్)



ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా సిద్ధం చేసిన సెల్ఫ్ ఆన్‌లైన్ సాధనం

సబ్బవరం: విద్యార్థులను స్వీయ అభ్యాసం-స్వీయ మూల్యాంకనం వైపు ప్రోత్సహించే విధంగా సబ్బవరం మండలంలోని నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సెల్ఫ్ అనే వినూత్న ప్రొగ్రాంను ఆవిష్కరించారు. ఈ ప్రొగ్రాం ద్వారా విద్యార్థులు తమకు అర్థంకాని అంశాలతో పాటు సందేహాలను ఆన్‌లైన్‌లోనే నివృత్తి చేసుకునేవిధంగా ప్రొగ్రాం రూపొందించారు.

ఎక్కడైనా.. ఎప్పుడైనా..

ఇది ఆన్‌లైన్ సాధనం కావడంతో స్మార్ట్ ఫోన్‌లో విద్యార్థులు ఎక్కడైనా,ఎప్పుడైనా ఉపయోగించుకోవచ్చు. ప్రస్తుతం పదో తరగతి విద్యార్థులు సరళమైన పద్ధతిలో అన్ని సబ్జెక్టులు అర్థం చేసుకుని తమ సందేహాలను నివృత్తి చేసుకునే విధంగా దీన్ని సిద్ధం చేశారు. విద్యార్థులు తమ అభ్యసనలో భాగంగా వరుసగా అడిగే ప్రశ్నలకు ముందుగా జవాబులు చెప్పిన తర్వాతే ఇతర ప్రశ్నలు వచ్చే విధంగా రూపొందించారు. ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోతే దానికి సంబంధించిన సమాధానం వివరించే వీడియో వచ్చేలా ప్రొగ్రాం డిజైన్ చేశారు. వరుసగా అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పిన తర్వాతే ముందుకు వెళ్లడం జరుగుతుంది. దీంతో విద్యార్థులు క్లిష్టమైన అంశాలను నేర్చుకోవడంతో పాటు మరింత విస్తృతంగా సంబంధిత అంశాలను తెలుసుకోవచ్చు.

సాఫ్ట్‌వేర్ లేకుండానే ..

ఈ టూల్‌ను వినియోగించుకోవడానికి ఎలాంటి సాఫ్ట్‌వేర్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాల్సిన అవసరం లేదు. కేవలం పీడీఎఫ్ ఫైల్ ద్వారా వినియోగించుకునే విధంగా రూపొందించారు. ఈ సెల్ఫ్ ప్రొగ్రాంలో భాగంగా సబ్జెక్టుల వారీగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సామర్థ్యాన్ని పాఠశాల,మండల,జిల్లా స్థాయిల్లో పర్యవేక్షించేందుకు అవసరమైన డ్యాష్ బోర్డును కూడా రూపొందించారు.

ప్రయోజనం ఇలా..

విద్యార్థి సబ్జెక్టును అర్థం చేసుకోవడంలో సమస్య ఉంటే వీడియోను పదేపదే వీక్షించవచ్చు. అతను ఎప్పుడైనా,ఎక్కడైనా అంశాలను చూసుకోవచ్చు.ఇది స్వీయ మూల్యాంకనం, స్వీయ అభ్యసన సామర్థ్యాన్ని ప్రోత్సహిస్తుంది. ఈ వీడియోలు గూగుల్ ఫామ్‌లో పొందుపర్చడంతో విద్యార్థులు కంటెంట్ వీడియో నుంచి పక్కకు మరళలేరు. ఈ టూల్‌ను క్లిక్‌బుల్ పీడీఎఫ్ ద్వారా వినియోగించుకోవచ్చు. గూగుల్ ఫారంలో 10 ప్రశ్నలు ఎంసీక్యూ రూపంలో ఇచ్చారు.తద్వారా విద్యార్థులు సరైన సమాధానం ఎంచుకుంటే తదుపరి ప్రశ్నకు వెళ్తుంది. విద్యార్థి తప్పు సమాధానం ఎంచుకుంటే అది వివరణ వీడియోకి తీసుకువెళ్తుంది. పూర్తి వీడియో చూసిన తర్వాత విద్యార్థి సరైన సమాధానం ఎంచుకోవడానికి అదే ప్రశ్నకు మళ్లించబడతారు. దీంతో విద్యార్థులు క్లిష్టమైన భావనలను నేర్చుకోగలుగుతారు.

ప్రొగ్రాం లక్ష్యం

- స్వీయ అభ్యాసం-స్వీయ మూల్యాంకనం వైపు విద్యార్థులను ప్రోత్సహించడం.
- విద్యార్థుకు క్లిష్టమైన అంశాల్లో సందేహాలను నివృత్తి చేయడం.
- తక్షణ సందేహ నివృత్తి కలిగించడం.
- విద్యార్థుల నిరంతర మూల్యాంకనం.
- పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేయడం.



SELF EVALUATION & LEARNING FOR FUTURE

	School	Record Count
1.	ZPHS S. RAYAVARAM	129
2.	ZPHS BOLLIGUNTA	116
3.	ZPHS G. KODURU	109
4.	ZPHS OCPALLI WEST	103
5.	PBM Z P High School VEMU..	103
6.	ZPHS G KASIMKOTA	101
7.	ZPHS K.KOTPAKA	96
8.	ZPHS THUMMAPALA	93
9.	MPL TOWN GIRLS HS	92
10.	ZPHS JALLURU	82
11.	KGBV BOLLIGUNTA	79
12.	ZPHS T. ARJAPURAM	74
13.	ZPHS NANGINARAPADU	73
14.	ZPHS pedabodderpalli	68
15.	KGBV KOTAURATLA	66
16.	ZPHS ATCHUTHAPURAM	60
17.	ZPHS DONDAPUDI	59
18.	ZPHSS MADUGULA	59
19.	ZPGHS VEMULAPUDI	58
20.	ZPHSCHOOL LAKSHMIPUR..	56
21.	ZPHS YERPETA	56
22.	ZPHS MAKAVARAPALEM	55
23.	ZPHS KUNDRAM	55
24.	ZPHS KORUPROLU	54
25.	ZPHS GANAPARTHI	53
26.	Ap Model School, vemulapudi	52
27.	Z P G H School Narsipatnam	51

డ్యాష్‌బోర్డ్‌లో పాఠశాలల వారీగా వివరాలు చూపిస్తున్న సెల్ఫ్ ఆన్‌లైన్ ప్రొగ్రాం

పర్యవేక్షణకు డ్యాష్‌బోర్డ్



పాఠశాల,మండల,జిల్లా స్థాయిల్లో పర్యవేక్షించడాని అవసరమైన డ్యాష్ బోర్డు రూపొందించాం.ఈ డ్యాష్ బోర్డులో జిల్లాలోని అన్ని మండలాల వారీగా అన్ని ప్రభుత్వ పాఠశాలల పేర్లు ఉంటాయి. ఆయా పాఠశాలలను క్లిక్ చేయడం ద్వారా పూర్తి చేసిన విద్యార్థుల పేర్లు ప్రదర్శించబడతాయి.

–పోతూరి శ్రీనివాసరావు, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు, నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సబ్బవరం మండలం

సాధారణ ఆన్‌లైన్ సాధనం



సెల్ఫ్(సెల్ఫ్ ఎవల్యూషన్ అండ్ లెర్నింగ్ ఫర్ ఫ్యూచర్) ఇది విద్యార్థుల కోసం సాధారణ ఆన్‌లైన్ సాదనం. వారు దీన్ని ఎప్పుడైనా,ఎక్కడైనా స్మార్ట్ ఫోన్ ద్వారా వినియోగించుకోవచ్చు. ఇది ప్రతి అధ్యాయానికి సంబంధించిన బహుళ ఎంపిక ప్రశ్నలు అడుగుతుంది. విద్యార్థులు తమ స్వీయ అభ్యాసం-మూల్యాంకపం కోసం గూగుల్ ఫారం ఆధారిత ఆన్‌లైన్ మూల్యాంకనాలను సబ్జెక్టుల వారీగా సిద్ధం చేశాం.

– నంది సోమేశ్వరరావు, ఉపాధ్యాయుడు, నంగినారపాడు జెడ్పీ హైస్కూల్

కేంద్రం నిర్ణయాలతో కార్మికులకు అన్యాయం



దీక్షలో పాల్గొన్న కాంట్రాక్ట్ కార్మికులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేట్‌పరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు అన్యాయం చేస్తోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. కార్మికులకు నష్టం కలిగించే ఈ నిర్ణయాలపై కేంద్రం పునరాలోచించుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే దీక్షల్లో 745వ రోజు, ఆదివారం సంస్థకు చెందిన కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని, సంఘీభావం తెలిపారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తుల చేతికి ఇస్తే కార్మికుల భవిష్యత్తు అంధకారంగా మారుతుందన్నారు. కార్మిక చట్టాలను విస్మరించి కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై ప్రజల ఆగ్రహంగా ఉన్నారన్నారు. ప్రజాశేయస్సు కోరి ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రైవేటీకరణ నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని కోరారు.

అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ

అక్కిరెడ్డిపాలెం: అగ్ని ప్రమాద బాధితులను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆదివారం పరామర్శించారు. జీవీఎంసీ 69వ వార్డు పరిధి నాతయ్యపాలెంలో గల సీఎస్సార్ కల్యాణమండపం వెనుక నివసిస్తున్న గంధల శ్రీనివాసరావు ఇంట్లో వంట చేస్తుండగా, గ్యాస్ లీక్ అవడంతో అగ్నిప్రమాదం సంభవించింది. అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. విషయం తెలియడంతో, బాధితులను ఎమ్మెల్యే నాగిరెడ్డి, వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు పరామర్శించారు.

భారతీయ సంస్కృతిని ప్రోత్సహించడమే ధ్యేయం

- ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా



విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న సిన్హా

పరవాడ: భారతీయ వారసత్వం, సంస్కృతిని ప్రోత్సహించడమే ఆనంద మేళా లక్ష్యమని సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. సింహాద్రి ఎన్టీపీసీ, దీపిక లేడీస్ క్లబ్ సంయుక్తంగా దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లోని సాధన క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన ఆనంద మేళాను సిన్హా ప్రారంభించారు. దీపిక లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజూ సిన్హా ఆహుతులకు స్వాగతం పలికారు. అనంతరం సిన్హా మాట్లాడుతూ సమాజ ఉద్ధరణకు దీపిక లేడీస్ క్లబ్ సహకారం అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెరిటోరియస్ విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. మేళాలో భాగంగా భారతీయ వంటకాలను ప్రదర్శనలో ఉంచారు. విద్యార్థులు సాంస్కృతిక నృత్య రూపాలు, సాంప్రదాయ కళలను ప్రదర్శించి ఆహుతుల మన్ననలు పొందారు. కార్యక్రమంలో సంస్థ ఉన్నతాధికారులు, దీపిక లేడీస్ క్లబ్ ప్రతినిధులు, సభ్యులు, అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



వేంకటేశ్వర స్వామి దేవాలయం

ఉక్కునగరం: స్థానిక సెక్టార్-1లోని కొండపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు సాయంత్రం 7 గంటలకు అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 28న మంగళవారం ఉదయం 9 గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం 7 గంటలకు శ్రీవారి కల్యాణం జరిపించనున్నారు. మార్చి 1న బుధవారం ఉదయం 9 గంటలకు వైదిక సదస్యం, సాయంత్రం 7 గంటలకు పండిత సదస్యం జరగనుంది. మార్చి 2, 3 తేదీల్లో ఉదయం 9 గంటలకు నిత్య హోమం , సాయంత్రం 7 గంటలకు లక్ష తులసి పూజ నిర్వహించనున్నారు. 04న శనివారం ఉదయం 8 గంటలకు ధ్వజ అవరోహణం, నవకలశ స్నపనం, సాయంత్రం 7 గంటలకు పుష్పయాగం, ఉయ్యాల సేవ, రుత్విక్‌ల సన్మానంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.